క్లుప్తంగా

50 మంది యువకులు రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ మహమ్మద్

రావికమతం: గ్రామ యువత, తాసుబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టి.అర్జాపురంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, వైస్ ఎంపీపీ మత్స భవానీశంకర్, సర్పంచ్ మడగల అర్జున, కొత్తకోట ఎస్ఐ విభీషణరావు, నాయకుడు ఇల్లపు సన్యాసినాయుడు రక్తదాతలను అభినందించారు. తరచూ రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. రక్తదానం ఎందరికో ప్రాణదానం చేసినట్లవుతుందన్నారు. నిర్వాహకులను అభినందించారు.

వైభవంగా పెద్దింటమ్మ ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న వైస్ ఎంపీపీ, పార్టీ నాయకులు

రోలుగుంట: కుసుర్లపూడిలో ఈ నెల 3న ప్రారంభమైన గ్రామ దేవత పెద్దింటమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమం ముగింపు రోజు మంగళవారం వరకూ కొనసాగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

రీసర్వేకు దరఖాస్తులు చేసుకోవాలి

మాకవరపాలెం: రీసర్వేలో భూములు సర్వే చేయించలేని రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో 8 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. ఈ గ్రామాల్లో సర్వే చేయించలేని రైతుల తోపాటు శాశ్వత భూ హక్కు పత్రాల్లో తప్పులు ఉంటే, అలాంటి రైతులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పది రోజులు సమయం ఉందని, రైతులు ఆలస్యం చేయకుండా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

మాకవరపాలెం: విశాఖకు చెందిన అనిల్ నీరుకొండ ఆస్పత్రి, లయన్స్ బ్లడ్ బ్యాంకు, ఏబీ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్త వీధిలోని క్రీస్తు ప్రార్థనా మందిరంలో ఆదివారం మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాల్లో వివిధ గ్రామాలకు చెందిన 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 26 మంది రక్తదానం చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని విశాఖ తరలించి చికిత్సలు అందిస్తామని సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ తెలిపారు. చర్చి పాస్టర్ కిరణ్‌బాబు, శిబిరం నిర్వాహకులు జాన్, గంగరావు పాల్గొన్నారు.

వరాహలక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం పలు ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి నూతన చీర అలంకరణ, దీపాలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు సేవించాల్సిందిగా కోరారు.

తాండవ ప్రాజెక్టుకు పర్యవేక్షణ కరువు

- ప్రధాన గేట్లు వద్ద చిన్నారుల చేపల వేట
- ప్రమాదకర ప్రాంతాల్లో సందర్శకుల జలకాలాట
- మాయమవుతున్న విద్యుత్ సామగ్రి



గాలాలతో చేపలు వేటాడుతున్న విద్యార్థులు



సిబ్బంది పర్యవేక్షణ లేని తాండవ ప్రాజెక్టు మెయిన్ గేటు



తాండవ ప్రధాన గేట్లు లోపల చేపలు వేటాడుతున్న చిన్నారులు

నాతవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోనే మేజరు ప్రాజెక్టుగా ప్రసిద్ధి గాంచిన తాండవ రిజర్వాయరుకు పర్యవేక్షణ కొరవడింది. దాంతో ఇక్కడ విలువైన విద్యుత్ సామగ్రి చోరీకి గురవుతోంది. పైగా ప్రతి ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చే సందర్శకులకు భద్రత కరువైంది. ఇంతవరకూ తాండవ రిజర్వాయరు చూసేందుకు అక్కడ కాపలాగా ఉండే సిబ్బంది అనుమతితోనే లోపలకు వెళ్లేవారు. ఇటీవల సదరు సిబ్బంది పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. దీంతో తాండవ ప్రాజెక్టుపై అధికారులు పర్యవేక్షణ లేక చిన్నారులు, సందర్శకులు జలాశయంలోకి దిగేస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల నలుమూలల నుంచి ప్రత్యేక వాహనాల్లో సందర్శకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఇక్కడ నీటిలో జలకాలాటాలు ఆడేందుకు దిగేస్తున్నారు. ఇలా చేయడం ప్రాణాపాయం అని తెలిసినా వెనుకడుగు వేయడం లేదు. దీంతోపాటు తాండవ చమ్మచింత హాస్టల్ విద్యార్థులు ప్రతి ఆదివారం ఇక్కడకు వచ్చి గాలాలతో చేపలు వేటాడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటున్నారు. తాండవ ప్రధాన గేట్లు వద్ద ప్రమాదమని తెలిసినా పట్టించుకోలేదు. ఇటీవల కొంత మంది సందర్శకులు మందలించడంతో చిన్నారులు ప్రధాన గేట్లుపై దూకి పరారయ్యారు. కొంతమంది విద్యార్థులు తాండవ జలాశయం లోపల భాగంలోకి దర్జాగా దిగి గాలాలతో చేపలు వేటాడుతున్నారు. ఆ ప్రదేశంలో ప్రాజెక్టు లోతు 378 అడుగులకుపైగా ఉంది. అక్కడ ప్రమాదవశాత్తు నీటిలో పడితే మనిషి జాడ దొరకడం కష్టమని చెప్పొచ్చు.

అంధకారంలో ప్రాజెక్టు

తాండవ ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోవడంతో రాత్రిళ్లు తాండవ ప్రాజెక్టు చీకటిమయంగా ఉంటోంది. అధికారులు పర్యవేక్షణ లేక గతంలో తరుచూ ప్రమాదాలు, చోరీలు జరిగేవి. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణను వివరణ కోరగా, సిబ్బంది కొరత కారణంగా తాండవ ప్రాజెక్టుపై ఎవ్వరినీ కాపలా పెట్టలేదన్నారు. తాను స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నానన్నారు.

పూత దశలో నువ్వు సాగు



ఆర్.వై అగ్రహారంలో నువ్వు పంట

కె.కోటపాడు: మండలంలో నువ్వు పంట పూత దశలో కళకళలాడుతోంది. ఖరీఫ్ వరికోతలు పూర్తయిన పొలాల్లో రబీ పంటగా విస్తారంగా సాగు చేస్తున్నారు. నువ్వు పంటకు నీటి సాంద్రత తక్కువగా ఉన్న పంట దిగుబడి బాగుంటుందని రైతులు తెలుపుతున్నారు. వేసవి దృష్ట్యా ప్రధానంగా ఈ పంటను నీటి లభ్యత ఉన్న వ్యవసాయ బావులు, సాగునీటి చెరువుల సమీపంలో పొలాల వద్ద సాగు చేస్తున్నారు. డి.అగ్రహారం, గుల్లేపల్లి, రామచంద్రపురం, కింతాడ, పింద్రంగి, పోతనవలస, ఆర్లి, చౌడువాడ, ఎ.భీమవరం, పాడుగుపాలెం, పైడంపేట గ్రామా ల్లో 150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో నువ్వులకు మంచి డిమాండ్ ఉండటంతో సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

495 గృహాల మంజూరు

మాకవరపాలెం: మండలానికి కొత్తగా 495 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందని హౌసింగ్ జేఈ రామలింగస్వామి ఆదివారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 495 గృహాలు కేటాయించిందని, స్థలాలు ఉండి, అర్హత ఉన్న వారికి వీటిని మంజూరు చేస్తామన్నారు.

మహిళల్లో ప్రతిభ వెలికితీతకు పోటీలు



స్పూమనీ గేమ్ ఆడుతున్న పరిపూర్ణ మహిళలు

నర్సీపట్నం: మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం స్టార్ మహిళ, పరిపూర్ణ మహిళా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఫెడరేషన్ అధ్యక్షుడు దేవాడ సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఐసీది వ్యాపార దృక్పథమే కాకుండా ఈ పోటీల ద్వారా మహిళలను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలకు మ్యూజికల్ చైర్, నెంబర్ గేమ్, స్పూమన్ గేమ్, బెలూన్స్, వెజిటబుల్ గేమ్స్ నిర్వహించారు. ఈ నెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఫెడరేషన్ సభ్యులు నాగేశ్వరరావు, లగుడు సత్యనారాయణ, చిన్నయ్య, ప్రకాష్, కుంచా వెంకటరమణ పాల్గొన్నారు.

వేడుకగా వేంకటేశ్వర స్వామి పల్లకి సేవ



స్వామివారి పల్లకి సేవలో భక్తులు

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 2న ప్రారంభమైన వెంకన్న కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకురాగా, భక్తులు దర్శించుకుని బియ్యం, పప్పు తదితర స్వయంపాకం సరకులను సమర్పించుకున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం పేదలకు వరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సంధ్యారాణి

నర్సీపట్నం: విశాఖకు చెందిన కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సౌజన్యంతో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధులు, పేదల సౌకర్యార్థం వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఇది పేదలకు వరం అన్నారు. అనంతరం ఐకాన్ ఆస్పత్రి వైద్యులు టి.సంధ్యారాణి, యోగనాథ్ వైద్య సేవలందించారు. 150 మంది రోగులకు బీపీ, సుగర్, హృద్రోగ సంబంధించిన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి తగిన సూచనలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కుమార్‌బాబు, సంఘ సభ్యులు లక్ష్మీనారాయణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి చందు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



శస్త్రచికిత్సలకు విశాఖ తరలిస్తున్న దృశ్యం

రావికమతం: మేడివాడలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక యువకుడు పతివాడ ధనంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. 122 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 46 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఏరియా కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డూరులో అపూర్వ కలయిక



ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

చోడవరం రూరల్: అడ్డూరులో మజ్జి గౌరమ్మ ఆలయం వద్ద చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 2001–03 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం వేడుకగా జరిగింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత వీరంతా ఒకే చోటికి చేరుకోవడంతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి లెక్చరర్స్ డాక్టర్ నడుపూరి దేముడు, మురళీధర్‌లను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. తమ బ్యాచ్ పేరున చీడికాడ మండలం అప్పలరాజుపురంలోని లలితాదేవి వృద్ధాశ్రమానికి నగదు వితరణగా అందజేశారు.

శంఖ ప్రక్షాళనతో శరీర శుద్ధి

కశింకోట : శరీర శుద్ధికి చేసే యోగ క్రియలన్నింటిలో శంఖ ప్రక్షాళనం శ్రేష్టమైనదని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ యోగ శిక్షకుడు రమేష్ అన్నారు. అనకాపల్లి మండలం కోడూరులో జార్జి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శంఖ ప్రక్షాళన క్రియలు నిర్వహించారు. యోగ సాధకుల శరీరాన్ని అమూలాగ్రం శుద్ధి చేయడానికి ఈ క్రియలు జరిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌తోపాటు ఆరోగ్య ధాత్రి చీఫ్ ఫిజిషియన్ సుందర్ పెరుమాళ్లు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరంనాయుడు పాల్గొన్నారు.

గౌరమ్మా.. పోయిరావమ్మా..!



కశింకోటలోని గవరపేటలో శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం



రేలా రేలా రే ప్రదర్శన

- వేడుకగా వెలంపేట గౌరమ్మ నిమజ్జనోత్సవం

కశింకోట : స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఆర్కెస్ట్రా, మేళతాళాలతో గవరపేట, పెదగుమ్మం వద్ద శారదానది వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు గౌరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. బాణసంచా కాల్చారు. అనంతరం గౌరమ్మ విగ్రహానికి నది ఒడ్డున సంప్రదాయంగా పూజలు నిర్వహించి, నదిలో నిమజ్జనం చేశారు. ఈ ఏడాదంతా చల్లగ కాచిన తల్లీ.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా.. అంటూ మొక్కుకున్నారు. శనివారం రాత్రి ఉత్సవం సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. రేలా రేలా రే, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథ, గంధవరం బృందంతో వెంకటరమణమూర్తి పాట ఆలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రామాలయ నిర్వహణకు నిధుల విడుదల



పూజారికి వేతనం అందిస్తున్న రామాలయ కమిటీ సభ్యులు

చీడికాడ: స్థానిక రామాలయం నిర్వహణకు దేవదాయ శాఖ నుంచి నిధులు విడుదలైనట్లు ఆలయ కమిటీ సభ్యులు పరువాడ మహేష్, రామారావు ఆదివారం తెలిపారు. ఆలయానికి దేవుడు మాన్యం 9 ఎకరాలున్నా, గత పాలకులు లోపాయికారి ఒప్పందాలతో నిర్వహణకు పైసా ఇచ్చేవారు కాదన్నారు. దీంతో గతేడాది ఈ భూములకు దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయించామన్నారు. ఇలా వచ్చిన ఆదాయంలో ఆలయ పూజారికి, ధూప, దీప నైవేద్యాలకు, స్వీపరుకు కలిపి ఏడాదికి రూ.11,200 విడుదల చేశారన్నారు.

దేవరాపల్లిలో భారీ అన్నసమారాధన



అన్నసమారాధనకు తరలివచ్చిన భక్తులు

దేవరాపల్లి: స్థానిక వనదేవీశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయం ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా వేలాది మంది భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు, గౌరి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి వనదేవీశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు కనులారా తిలకించి తరించారు. సోమవారం స్వామివారి ఊరేగింపును మహిళల కోలాట ప్రదర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ



పేటలో ఎద్దుల పరుగు పందెం

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా అమ్మవారి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందించారు.

రేపు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్: జి. అగ్రహారంలో పోలిపల్లెమ్మ పండగ మంగళవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ నందారపు మంగమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ. 12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున అందజేస్తామన్నారు. జిల్లా స్థాయి కోలాటం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున ప్రదానం చేస్తామన్నారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు పందెం

- వైభవంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం



గుర్రాల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కోలాటాలు, డప్పులు, వాయిద్యాలు నడుమ వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శక్తివేషాలు, నేల వేషాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పందేలను ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, శ్రీనాథు జగ్గారావు, కమిటీ సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలు చూడటానికి మండలం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. వర్తక సంఘం సభ్యులు కొట్ని సత్తిబాబు, పుట్టా బలరామ్, పెచ్చేటి కొండలరావు, పెచ్చేటి నానాజీ, కోట్ని వెంకట శ్రీనువాస్ పాల్గొన్నారు.

డివిజన్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడిగా నాగప్పారావు



నర్సీపట్నం: ఈపీడీసీఎల్ యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ నర్సీపట్నం డివిజన్ అధ్యక్షుడిగా చోడవరం లైన్ ఇన్‌స్పెక్టర్ కనిశెట్టి నాగఅప్పారావు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎన్జీహోమ్‌లో యూనియన్ డివిజన్ నాల్గో మహాసభ నిర్వహించారు. ఈ సభలో డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.రవి ఎన్నికయ్యారు. నాగప్పారావును యూనియన్ నాయకులు భాస్కరరావు, వేపాడ సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, బి.ఎం.ఎల్. నాయుడు, రమేష్ అభినందించారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) అడ్వైజర్ కె.భాస్కరరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులను సకాలంలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు.

పట్టభద్రులంతా సుధాకర్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ధర్మశ్రీ



చోడవరం: ఓటర్లతో సమావేశమైన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం/రావికమతం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదివారం చోడవరం, రావికమతం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం చోడవరం మండలం దుడ్డుపాలెం, వెంకన్నపాలెం గ్రామాల్లో పార్టీ శ్రేణులను కలుసుకుని పట్టభద్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓటర్లను స్వయంగా కలుసుకుని పార్టీ బలపరిచిన అభ్యర్థి సుధాకర్ విజయానికి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించారు. అందుబాటులో లేని ఓటర్లకు ఫోన్‌కాల్ చేసి వారి ఓట్లను వేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, మరింత ప్రగతిని సాధించడానికి అధికార పార్టీని బలపరచాలని కోరారు. చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, సర్పంచ్‌లు కూర్మదాసు మాలిబాబు, మొల్లి ఈశ్వరరావు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మొల్లి సోమునాయుడు పాల్గొన్నారు. మధ్యాహ్నం రావికమతం మండలం తోటకూరపాలెం, రావికమతం, గుడ్డిప, మేడివాడ, దొండపూడి, కొత్తకోట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మాడుగుల/రూరల్: ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం మాడుగులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అవురువాడ పంచాయతీ శివారు సీతలబంద, తిరువాడ, వీరనారాయణం, తదితర గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎంపీటీసీ చదల కృష్ణందొర ప్రచారం చేశారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, వార్డు మెంబరు శీలామంతులు జ్యోతి, నాయకులు పొలిమేర చిన్నారావు, కుక్కర మోదకొండ, పుట్టా మురళి పాల్గొన్నారు.